క్లుప్తంగా

పంట నష్ట వివరాల సేకరణ


దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఈఓ

నవాబుపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి, కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఏఈఓ ఆదీల్ పేర్కొన్నారు. మండలంలోని నారెగూడ, పూలపల్లి తదితర గ్రామాల్లో బుధవారం వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. దెబ్బతిన్న పంటలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. చించల్‌పేట క్లస్టర్‌లో వర్షాలకు ధ్వంసమైన పంటల వివరాలను రికార్డు చేసుకొని ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.

ఎకరాకు రూ.20 వేలు ఇవ్వండి

సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్


సభలో మాట్లాడుతున్న మహిపాల్

ధారూరు: వర్షాలకు పాడైన పంటలకు యుద్ధ ప్రాతిపదికన నష్ట పరిహారం చెల్లించాలని, ఎకరాకు రూ. 20 వేలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్. మహిపాల్ డిమాండ్ చేశారు. సీపీఎం మహాసభను మండలంలోని మైలారం గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు లింక్ లేకుండా చేయాలన్నారు. అధిక వర్షాలకు కూలిపోయిన ఇళ్లకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలని కోరారు. అలాగే, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సూచించారు. కాంట్రాక్ట్ హౌసింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాణిక్యం, భాస్కర్, ప్రశాంత్, అశోక్, బాల్‌రాజ్, ప్రవీణ్, రాహుల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్


రవిగౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

తాండూరు రూరల్: రైతుల సంక్షేమానికి నిరంతరం పని చేస్తున్నామని డీసీసీబీ నూతన వైస్ చైర్మన్ సంగెం రవిగౌడ్ అన్నారు. బుధవారం తాండూరు మండలం మిట్టబాసుపల్లి గ్రామానికి చెందిన నాయకులు రవిగౌడ్‌ను శాలువ, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ.. రైతుల ఆశీస్సులతో డీసీసీబీ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యానని పేర్కొన్నారు. బ్యాంక్ అధికారులు, రైతుల సమన్వయంతో పని చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, మిట్టబాసుపల్లి గ్రామ మాజీ సర్పంచులు మల్లప్ప, ఇస్మాయిల్, మాజీ ఉప సర్పంచ గోవింద్, రైతులు పాల్గొన్నారు.

కేజీబీవీ నూతన ఎస్‌ఓగా ఆశలత



తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి గేటు వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ(కేజీబీవీ) నూతన స్పెషల్ ఆఫీసర్‌గా ఆశలత నియమితులయ్యారు. గతంలో పని చేసిన విజయకు పదోన్నతి రావడంతో బదిలీపై వెళ్లారు. నవాబ్‌పేట్ కేజీబీవీ ఎస్‌ఓగా పని చేసిన ఆశలత తాండూరు మండలానికి బదిలీపై వచ్చారు. బుధవారం ఎస్‌ఓ ఆశలత బాధ్యతలు చేపట్టారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

19 నుంచి జోనల్ క్రీడలు

జోనల్ ఇన్‌చార్జి పీడీ వసంత్

మోమిన్‌పేట: ఈ నెల 19 నుంచి 21 వరకు జోనల్ క్రీడలు నిర్వహించనున్నట్లు జోనల్ ఇన్‌చార్జి పీడీ (ఫిజికల్ డైరెక్టర్) వసంత్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మూడు మండలాల విద్యార్థిని, విద్యార్థులకు వివిధ క్రీడల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మోమిన్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అండర్ 14–17విభాగాల్లో గల విద్యార్థిని, విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్‌ల్లో ఎంపికలు జరుగుతాయని చెప్పారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థిని, విద్యార్థులు వయస్సు ధ్రువీకరణ, బోనఫైడ్ సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్సులపై పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంతకం చేసుకొని రావాలని సూచించారు. మిగతా వివరాలకు 90003 37072, 63051 41931 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బస్సులు రాక.. విద్యార్థుల ఇక్కట్లు!

మండలంలోని పలు గ్రామాలకు బస్సులు సమయానికి రాక పాఠశాలకు విద్యార్థులు, పనులకు వెళ్లే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు మార్గాల్లో బస్సు సర్వీస్‌లు లేవు. ఉన్న రూట్లలో సమయానికి బస్సులు రాకపోవడంతో పాఠశాలలకు వెళ్లలేక పోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ఉచిత బస్సు ప్రయాణ పథకంతో బస్సుల సంఖ్య తగ్గి.. సమయానికి రావడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

- పాఠశాలలకు ఆలస్యంగా హాజరు
- ఉచిత ప్రయాణ పథకంతోనే ఇబ్బందులు..
- బస్సుల సంఖ్య పెంచాలంటూ ఆందోళన


కొడంగల్‌లో బస్సు ఎక్కేందుకు ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, విద్యార్థులు

దుద్యాల్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీల్లో అత్యంత ప్రధానమైనది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ హామీ. దీంతో ఒక్కసారిగా మహిళల ఓట్లు గంపగుత్తగా పడ్డయనే నమ్మకం కాంగ్రెస్‌కు కల్గింది. అధికారంలోకి వచ్చిన వెంటనే పథకాన్ని పట్టాలెక్కించారు. అమలు చేసిన మొదట్లో బస్సుల సంఖ్య అధికంగానే నడిపిన ప్రభుత్వం రోజులు గడుస్తున్నా కొద్ది సగానికిపైగా తగ్గించారనే వాదన ప్రజల్లో బలంగా వినిపిస్తుంది. గతంలో మహబుబ్‌నగర్–తాండూరు బస్సులు కొడంగల్, దుద్యాల్, కోస్గి మండలాల మీదుగా నిత్యం 10 నిమిషాల వ్యవధిలో ఒక బస్సు చొప్పున రవాణా కొనసాగించేవి. కాని, ప్రస్తుతం గంటకు వ్యవధిలో ఒకటి లేదా రెండు బస్సులు మాత్రమే వస్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. బస్సులు తగ్గడానికి కారణం ఉచిత ప్రయాణ పథకం ప్రవేశపెట్టడమే అని ప్రజలు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు సమయానికి బస్సులు రాకపోవడంతో నిత్యం పాఠశాలలకు ఆలస్యంగా వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సు స్టేజీల దగ్గర జనాలు ఎక్కువగా కనిపిస్తే చాలు బస్సులు ఆపడం లేదని విద్యార్థులు, మహిళ ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉచిత ప్రయాణం కావడంతో డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికుల పట్ల చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఉచిత ప్రయాణంపై ప్రభుత్వం పునరాలోచించాలని మహిళలు, విద్యార్థులు సూచిస్తున్నారు. చార్జీలు వసూళ్లు చేసిన పర్లేదు బస్సుల సంఖ్య పెంచాలని విద్యార్థులు కోరుతున్నారు.

రోజూ ఆలస్యంగా వెళ్తున్నాం..



తాండూరులోని ఓ కళాశాలలో ఐటీఐ చదువేందుకు హస్నాబాద్ నుంచి తాండూరుకు ప్రతి రోజూ ప్రయాణం చేస్తాను. ఉ. 8 గంటలకు గ్రామ స్టేజీ వద్ద బస్సు కోసం నిలబడితే ఉ. 9 అయినా కూడా బస్సులు రావడం లేదు. దీంతో కళాశాలకు నిత్యం ఆలస్యంగా వెళ్లాల్సి వస్తుంది. ఆలస్యంగా రావటం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

– టి.శివకుమార్, ఐటీఐ విద్యార్థి

తరగతులు మిస్ అవుతున్నాం..



కోస్గిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువేందుకు నిత్యం కోస్గికి వెళ్తుంటాం. డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న సమయంలో బస్సులు చాలా వచ్చేవి. ప్రయాణం చాలా సులువుగా ఉండేది. కాని, ప్రస్తుతం బస్సుల సంఖ్య తగ్గిపోయింది. సమయానికి బస్సులు రావడం లేదు. కళాశాలకు వెళ్లే సరికి చాలా ఆలస్యం అవుతుంది. దీంతో తరగతులు తప్పుతున్నాయి.

– శిరీష, డిగ్రీ విద్యార్థి

పొలాలకు వెళ్లేందుకు దారి నిర్మించండి

జినుగుర్తిలో రైతుల ఆవేదన


ప్లాంట్ ఇన్‌చార్జికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

తాండూరు రూరల్: పొలాలకు వెళ్లేందుకు దారిని నిర్మించాలని మండలంలోని జినుగుర్తి గ్రామ రైతులు సోలార్ ప్లాంట్ యాజమాన్యాన్ని కోరారు. బుధవారం జినుగుర్తి సమీపంలో ఉన్న సోలార్ ప్లాంట్ వద్ద రైతులు నిరసన వ్యక్తం చేశారు. వారికి ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింలు మాదిగ, కురువ సంఘం నాయకులు నర్సింలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సోలార్ ప్లాంట్ యజమాన్యం నిర్లక్ష్యం కారణంగా 100 ఎకరాల్లో పంటలు పాడవుతున్నాయని ఆరోపించారు. గ్రామంలోని ఊరడమ్మ దేవాలయం నుంచి శ్రీరాముల ప్రాజెక్టు వరకు పొలాలకు వేళ్లేందుకు దారి నిర్మిస్తామని హామీ ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. దీంతో భారీ వర్షాల కారణంగా సోలార్ ప్లాంట్ నుంచి వచ్చిన నీటి వల్ల పంటలు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లేదంటే ఎకరాకు రూ.20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 15 రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే ప్లాంట్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు. అనంతరం సోలార్ ప్లాంట్ ఇన్‌చార్జి పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు మొగులప్ప,రవి, విజయ్‌కుమార్, రాములు, నర్సింలు, మాణిక్యప్ప, ఎల్లయ్యలు ఉన్నారు.

పంట వివరాలు తప్పనిసరి

పూడూరు: రైతులు వర్షాకాలంలో వేసిన పంటలను తప్పనిసరిగా వ్యవసాయ శాఖ వెబ్‌సైట్ లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసా య విస్తీర్ణ అధికారి ఇలియాస్ పేర్కొన్నారు. పంటల వివరాలను నమోదు చేసుకుంటే ప్ర భుత్వ మద్దతు ధర లభించడంతో పాటు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వివరించారు. పంట వివరాలను నమోదు చేసుకోలేని రైతులు విధిగా పట్టదారు పాస్‌బుక్‌తో వ్యవసాయ అధికారులకు సంప్రదించాలని సూచించారు.

నేడు ఆర్‌ఎస్‌ఎస్ సమావేశం

కుల్కచర్ల: మండల కేంద్రంలో నేడు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నగర సాంఘిక్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కుల్కచర్ల మండల ఆర్‌ఎస్‌ఎస్ ఖండ కార్యవాహ కంకంటి ఆంజనేయులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలోని వివేకానంద కళాశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. హిందూ బంధువులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

దివ్యాంగ విద్యార్థుల వివరాల సేకరణ

బొంరాస్‌పేట: ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థుల వివరాలను డీఈఓ కార్యాలయానికి పంపనున్నట్లు ఎంఈఓ రాంరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న దివ్యాంగులైన విద్యార్థులకు 2025 వార్షిక పరీక్షల సమయంలో ప్రత్యేక అవసరాల ఏర్పాటుకు ముందస్తుగా వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల నుంచి నేరుగా డీఈఓ కార్యాలయానికి సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

అమ్మపేరుతో మొక్కను నాటి సంరక్షించాలి


మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కొడంగల్ రూరల్ : ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో ఓ మొక్కను నాటి సంరక్షించేందుకు కృషి చేయాలని ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్యామలమ్మ అన్నారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఈఓ రాంరెడ్డి సూచనల మేరకు ‘ఏక్ పేడ్ మా కే నామ్’ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయ సిబ్బంది పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..విరివిగా మొక్కలు నాటడంతో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయన్నారు. వృక్ష సంపదతోనే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని, సకల జీవరాశి ఆరోగ్యంగా ఉండేందుకు ఆస్కారం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీవాణి, పీడీ సుధాకర్, డ్రాయింగ్ మాస్టర్ తిరుమలేష్, జూనియర్ అసిస్టెంట్ వెంకటాచలం పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న స్పీకర్

మర్పల్లి: మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సింగం శెట్టి చంద్రశేఖర్ గుప్తా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ బుధవారం వారికి ఇంటికి వెళ్లి చంద్రశేఖర్ గుప్తా చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రాములు యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేశ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రామేశ్వర్, పట్లూర్ మాజీ ఎంపీటీసీ సురేశ్, మండల నాయకులు ఫసి, సలీం, రాచన్న తదితరులు ఉన్నారు. అంతకుముందు మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, చంద్రశేఖర్ గుప్తా చిత్రపటానికి నివాళులర్పించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


విద్యార్థులతో యోగా చేయిస్తున్న మల్లిఖార్జున్

కొడంగల్ రూరల్ : ప్రతి రోజూ కొంత సమయం యోగా, ప్రాణాయామం చేయడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని శంషాబాద్ ఆశారాం బాపూజీ శిష్యులు మల్లిఖార్జున్ అన్నారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు యోగా, ప్రాణాయామంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ధ్యానం, యోగా, ప్రాణాయామం నేర్పిస్తూ అభ్యాసనం చేయించారు. వీటిని ప్రతీరోజు కొంత సమయం చేయడంతో జ్ఞాపకశక్తి పెరుగుతోందన్నారు. నేటి యువత ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. యోగా, ధ్యానం చేయడం అలవాటు చేసుకుంటే బీపీ, షుగర్, వెన్నెముక, మోకాళ్ల, మెడ, కండరాల నొప్పులు.. అజీర్ణం, మలబద్ధకం తదితర వ్యాధులు దూరమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మురళీధర్, సీనియర్ ఉపాధ్యాయులు వెంకటేశ్, ఆనంద్‌రావు, ఏసురత్నం, గోపీనాథ్, పీడీ అజీజ్ పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి బదిలీ సహజం



నర్సింలును సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు

కుల్కచర్ల: ప్రతీ ఉద్యోగికి బదిలీలు సహజమని చౌడాపూర్ మండల నోడల్ ఆఫీసర్ రాంచందర్ అన్నారు. బుధవారం చౌడాపూర్ మండలం వీరాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులు నర్సింలుకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసే ఉపాధ్యాయులకు ఎక్కడికి వెళ్లి నా గుర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు క్రిష్ణయ్య, ఏఏసీసీ చైర్‌పర్సన్ జంగమ్మ, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ సత్యం, ఉపాధ్యాయులు మహేందర్, ప్రసాద్‌గౌడ్, నరేష్, సునీత స్థానికులు రాములు, పాండురంగయ్య, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.


తాండూరు: గణేశుడికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ


తాండూరుటౌన్ : పూలవర్షం కురిపిస్తున్న ఎస్పీ తదితరులు


తాండూరు: గణేశుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే


యాలాల: వినాయకుడి లడ్డూను సొంతం చేసుకున్న ఖాసీం

బైబై.. గణేశా

జిల్లా వ్యాప్తంగా ఐదు రోజులుగా పూజలందుకున్న గణనాథులను బుధవారం భక్తులు నిమజ్జనానికి తరలించారు. భాజాభజంత్రీలు, నృత్యాలతో గణనాథుల శోభాయాత్ర సాగింది. గట్టి బందోబస్తు మధ్య ఊరేగింపు ప్రశాంతంగా కొనసాగింది. మత సామరస్యానికి ప్రతీకగా ముస్లింలు వినాయక విగ్రహంపై పూల వర్షం కురిపించారు. అనంతరం ముందుగా ఏర్పాట్లు చేసిన ఆయా చెరువులు, నదుల్లో వినాయకులను నిమజ్జనం చేశారు.


తాండూరు: లడ్డూను దక్కించుకున్న అశోక్ కుటుంబ సభ్యులు


బొంరాస్‌పేట: నిమజ్జనం చేస్తున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు


తాండూరు టౌన్ : పాత తాండూరులో వినాయక శోభాయాత్రలో భక్తులు


అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో వినాయకుడి నిమజ్జనం


తాండూరు: బాలాజీ మందిర్‌లో ఏర్పాటు చేసిన గణేశ్ లడ్డూతో దినేష్ పర్తానీ


దుద్యాల్: నిమజ్జనానికి శ్రీశైలం బయల్దేరిన భక్తులు


తాండూరు: మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో గణనాథుడు


తాండూరు రూరల్: వాగులో నిమజ్జనం చేస్తున్న భక్తులు


తాండూరు: కన్యపాఠశాలమండపం వద్ద లడ్డూను దక్కించుకొన్న అభిలాష్


తాండూరు: గంజ్ అసోసియేషన్ గణనాథుడి శోభాయాత్రలో మహిళల కోలాటం


ధారూరు: కోలాటం ఆడుతున్న విద్యార్థినులు


దుద్యాల్: నిమజ్జనానికి తరలిన గణనాథుడు


కుల్కచర్ల: లడ్డూను దక్కించుకున్న భాస్కర్